ప్రజాశక్తి

సోమవారం 25 ఆగస్టు 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



మచిలీపట్నంలో చెత్త డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

అక్టోబర్ నాటికి యార్డుల్లో చెత్త తరలింపు

మున్సిపల్ మంత్రి నారాయణ

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : వచ్చే గాంధీ జయంతి నాటికి రాష్ట్రంలో లెగిసి వేస్ట్‌ను పూర్తిగా తొలగిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. ఆదివారం భీమవరంలో ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు 216 జాతీయ (మిగతా 2లో)

బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలు పేట్టాలని

నేటి నుండి సింగ్‌నగర్‌లో పాదయాత్ర

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు వెల్లడి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయాలని డిమాండ్



ప్రజాశక్తి - విజయవాడ : బుడమేరు వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని కోరుతూ ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు సింగ్‌నగర్‌లోని ఏడెనిమిది డివిజన్ల పరిధిలో పాదయాత్ర నిర్వహిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు తెలిపారు. అనంతరం ఈనెల 30న సింగ్‌నగర్‌లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని చెప్పారు. గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. బుడమేరు ముంపు శాశ్వత నివారణ చర్యలకు రూ.10 వేల కోట్లు కేటాయించాలని, ఇంజినీరింగ్ నిపుణుల నివేదిక ప్రకారం డైవర్షన్ ఛానల్ సామర్థ్యం పెంచాలని, రిటైనింగ్ వాల్, సమాంతర కెనాల్ నిర్మించి వరద ముంపు నుంచి ప్రజలను కాపాడాలని డిమాండ్ చేశారు. శాశ్వత నివారణ చర్యల కోసం రాజకీయాలకతీతంగా అందరూ పోరాడాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు చేపట్టిన బుడమేరు శాశ్విత నివారణ చర్యలపై తక్షణమే అఖిలపక్ష కమిటీ సమావేశం నిర్వహించి చర్చించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుడమేరుకు వరదలు వచ్చి సెప్టెంబర్ 1 నాటికి ఏడాది పూర్తవుతుందన్నారు. నగరంలో 64 డివిజన్లకుగాను 32 డివిజన్లు బుడమేరు వరదకు మునిగిపోయాయన్నారు. 2.70 లక్షల కుటుంబాలు నిరాశ్రయుల య్యాయని అన్నారు. 6.50 లక్షల మంది ప్రజలు ముంపునకు గురయ్యారన్నారు. ఇదో మాయని మచ్చలాగా మిగిలిపోయిం దన్నారు. అయితే వరదలు వచ్చి ఏడాది (మిగతా 2లో)

ఆశల పల్లకీయేనా !!

ఒక్కరికీ అందని మార్గదర్శుల సాయం

నిరాశలో బంగారు కుటుంబాలు



3

వార్త 2లో

నేడు 'కార్మికులు, ఉద్యోగుల ముందున్న సవాళ్లు - పరిష్కారాలు'పై సదస్సు

- హాజరుకానున్న హేమలత

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

సిఐటియు కృష్ణాజిల్లా 12వ మహాసభ సన్నాహాల్లో భాగంగా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు "కార్మికులు, ఉద్యోగుల ముందున్న సవాళ్లు - పరిష్కారాలు' అన్న అంశంపై సదస్సు జరుగుతుందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వేస్టేషన్ సమీపంలోని 'శుభం' కళ్యాణ మండపంలో జరిగే ఈ సదస్సులో కృష్ణాజిల్లా కార్మికోద్యమ నిర్మాత కె.మధుసూదనరావు' స్మారకోపన్యాసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిఐటియు అఖిల భారత అధ్యక్షులు కె.హేమలత ప్రధానోపన్యాసం చేస్తారని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. సిఐటియు నాయకులు ఎస్. ధనుంజయరావు అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో జిల్లా కోశాధికారి బి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ప్రజారోగ్య బాధ్యత ప్రభుత్వానిదే...

జాతీయ సదస్సులో వక్తలు

వార్త మెయిన్‌లో



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ జి.వి.ఎస్.మూర్తి



వార్తలు మెయిన్, టాబ్లాయిడ్ లోపలి పేజీల్లో

శ్రమ ఆధారంగానే ప్రపంచ పురోగమనం

చిత్రకారుల రాష్ట్ర సమ్మేళనంలో వక్తలు

రొయ్య రైతు విలవిల!

- సీడ్ లోపంతో వైట్ కట్ వ్యాధి
- మార్కెట్లో ఒడిదుడుకులు
- దిగజారిన ధరలు
- కిలోకు రూ.60 వరకు నష్టపోతున్న రైతు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

రొయ్యలు సాగు చేస్తున్న రైతులు మార్కెట్ ఒడిదుడుకులతో విలవిల్లాడుతున్నారు. కంపెనీలు నాణ్యతలేని వనామి సీడ్ (రొయ్య పిల్ల)ను విక్రయించడంతో చెరువుల్లో వైట్ కట్ వ్యాధి వ్యాపిస్తోంది. దీనికితోడు పెట్టుబడి ఖర్చులు పెరగడం, రొయ్యల ధరలు కిలోకి అత్యల్పంగా రూ. 30 నుంచి అత్యధికంగా రూ.60 వరకు దిగజారడంతో రొయ్య ఉత్పత్తిదారులు నష్టాల బారినపడుతున్నారు. పెట్టుబడికి తెచ్చిన అప్పులు వడ్డీలు పెరిగి పోతున్నాయని ఆందోళన చెందుతున్నారు.



కృష్ణాజిల్లాలో లక్షా 15 వేల ఎకరాల్లో ఆక్వా (చేపలు, రొయ్యలు) సాగవుతోంది. కోడూరు, నాగాయలంక, మచిలీపట్నం, కృత్తివెన్ను, బంటుమిల్లి, గుడివాడ రూరల్, నందివాడ తదితర మండలాల్లో 33 వేల ఎకరాల్లో రొయ్యలను పెంచుతున్నారు. అయితే సీడ్ కంపెనీలు నాణ్యతలేని వెనామీ సీడ్ సరఫరా చేయడంతో చాలా ప్రాంతాల్లోని చెరువుల్లో రొయ్యలు వైట్‌కట్ (మిగతా 2లో)

పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు

- దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్
- ప్రజాశక్తితో సిఎంఒహెచ్ డాక్టర్ అర్జునరావు





ప్రజాశక్తి - విజయవాడ : పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజారోగ్య విభాగం ముఖ్య అధికారి (సిఎంఒహెచ్) డాక్టర్ కె.అర్జునరావు చెప్పారు. నగరంలో పారిశుధ్య మెరుగుదలకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిఐపి, విఐపి ప్రాంతాలతోపాటు రోడ్లు, వీధులు, ఫ్లైఓవర్లు, ఇతర ప్రధాన రహదారుల్లో స్వీపింగ్, డ్రైయిన్ల క్లీనింగ్‌తోపాటు చెత్త కుప్పలు తొలగించడం, బిన్లు పెట్టే ప్రాంతాల్లో క్లీన్‌గా ఉండేటట్లు, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్‌స్టేషన్ క్లీన్‌గా ఉండటానికి వీలుగా ప్రజారోగ్య విభాగం సిబ్బందిని ఎప్పటికప్పుడు కేటాయిస్తూ పని చేయిస్తున్నట్లు చెప్పారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతోపాటు మురికివాడల్లో సైతం వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నగరంలో రోజుకు 500 నుంచి 600 టన్నుల వరకు ఉత్పత్తి అవుతున్న చెత్తనంతటినీ చిలకలూరిపేట సమీపంలోని నాయుడుపేట వద్ద జిందాల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి టెన్‌టైర్ల ద్వారా తరలిస్తున్నట్లు చెప్పారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వీధులన్నీ పరిశుభ్రంగా ఉండటానికి వీలుగా ఎప్పటికప్పుడు రోడ్డు పక్కన, పల్లపుప్రాంతాల్లో నిలిచిపోయిన వర్షపునీటిని మోటార్ల ద్వారా తోడిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజారోగ్య విభాగం నగరంలో అమలుచేస్తున్న పలు కార్యక్రమాలను సిఎంఒహెచ్ డాక్టర్ అర్జునరావు ప్రజాశక్తికి వివరించారు.

ప్రశ్న : పారిశుధ్యం మెరుగుదలకు తీసుకుంటున్న (మిగతా 2లో)

నిలకడగా కృష్ణమ్మ

ఇన్‌ఫ్లో 3,83,916 క్యూసెక్కులు

సముద్రంలోకి 3,65,725

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఎగువ జలాశయాల నుంచి వస్తున్న వరద ఉధృతి తగ్గడంతోపాటు ఎన్టీఆర్ జిల్లాలోని వాగులు, వంకల వరద ప్రవాహం నిలిచిపోవడంతో బ్యారేజీ వద్ద వరద నిలకడగా కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టు నుంచి 3,83,916 క్యూసెక్కుల వరద ప్రవాహం ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగగా, కృష్ణా తూర్పు, పశ్చిమ ప్రధాన కాల్వలకు 18,191 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 3,65,725 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది. కృష్ణా నదికి వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



ఆశల పల్లకీయేనా !

ఒక్కరికీ అందని 'మార్గదర్శుల' సాయం

నిరాశలో బంగారు కుటుంబాలు

ప్రజాశక్తి - గన్నవరం : పి 4, బంగారు కుటుంబాలు.. ఈ మాట వినేందుకు చాలా బాగుంది. అయితే ప్రభుత్వం చేయాల్సిన పనిని సంపన్నులపైన, దాతలపైన పెట్టడం వల్ల ఈ పథకం ఆశించిన ఫలితాలను సాధించలేకపోతుందని ఆచరణలో అర్థమవుతోంది. కృష్ణాజిల్లా గన్నవరం మండలంలో వందలాది కుటుంబాలను బంగారు కుటుంబాల కింద ఎంపిక చేసినా నేటి వరకు ఒక్క కుటుంబానికి కూడా సహాయం అందలేదు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాలి కనుక సచివాలయాల్లో అధికారులు ఏదో కొన్ని కుటుంబాలను ఎంపిక చేయడంతోపాటు మార్గదర్శుల పేర్లు రాసి మమ అనిపించారు. నిజం చెప్పాలంటే ఈ పథకం కింద ఒక్క పేద కుటుంబానికి కూడా సహాయం అందలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. చాలా గ్రామాల్లో పేద కుటుంబాలను ఆదుకోవడానికి మార్గదర్శులు కూడా ఆసక్తి చూపడం లేదు. అధికారులే ఏదో రకంగా మాట్లాడి వారి పేర్లను కాగితాల మీద రాసి పెట్టుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వానికి పంపారు. ఆచరణలోకి వెళితే.. ఒక్క కుటుంబానికి కూడా ఎవ్వరూ సాయమూ అందలేదు.

ఈ పథకం అమలులో పలు సవాళ్లు, విమర్శలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా అధికారులకు, ఉద్యోగులకు టార్గెట్లు విధించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. మధ్యతరగతి వారు ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటున్నారని, అలాంటి వారిని ఈ పథకం కింద కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఒత్తిడి చేయడం విమర్శలకు దారి తీసింది. అదేవిధంగా సామాన్య ఉద్యోగులు ఇలాంటి ఒత్తిళ్ల ద్వారా ఇబ్బందులు పడతారని, అలా చేయడం ఈ పథకం ఉద్దేశాన్ని విస్మరిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

మండలంలో 3258 బంగారు కుటుంబాలు ఎంపిక

గన్నవరం మండలంలో 24 సచివాలయాలు ఉండగా 3258 కుటుంబాలను పిఫోర్ బంగారు కుటుంబాల పథకంలోకి వచ్చేలా ఎంపిక చేశారు. వారికి సహాయం చేయడానికి మార్గదర్శకులుగా 180 మందిని గుర్తించారు. సచివాలయ అధికారులు కుటుంబాలను గుర్తించి పేపర్ మీద పెట్టడం తప్ప ఒక్క కుటుంబానికి కూడా సహాయం చేయించిన పరిస్థితి లేదు. కొన్ని గ్రామాల్లో మార్గదర్శుల పేర్లు ఇవ్వడానికి ఆర్థికంగా ఉన్నవారు కూడా సిద్ధపడటం లేదని తెలుస్తోంది. పథకం అమలు తీరును చూస్తే.. చిక్కవరం సచివాలయ పరిధిలో చిక్కవరం, బీబీ గూడెం గ్రామాలు ఉన్నాయి. 327 కుటుంబాలను బంగారు కుటుంబాల పథకంలో అర్హులుగా ఎంపిక చేశారు. 10 మందిని మార్గదర్శులుగా గుర్తించారు. అయితే ఒక కుటుంబానికి కూడా సహాయం అందించలేదని చెబుతున్నారు. కేసరపల్లి పంచాయతీలో 294 మందిని అర్హులుగా గుర్తించగా, హెచ్‌సిఎల్ కంపెనీ, మరో 9 మందిని మార్గదర్శులుగా ఎంపిక చేశారు. అయితే వారిని నుంచి పేదలకు సహాయం గాని, చేయూతగాని అందలేదు. మేజర్ పంచాయతీయలైన గన్నవరం, బుద్ధవరంలోనూ అదే పరిస్థితి కొనసాగుతోంది. ముస్తాబాద సచివాలయంలో 400 కుటుంబాలను ఎంపిక చేయగా 18 మంది మార్గదర్శులను గుర్తించారు. ఎవరికీ రూపాయి సహకారం కూడా అందలేదు. ఈ గ్రామంలో కొండగట్టు పైన ప్రభుత్వ స్థలములో గుడిసెలు వేసుకుని ఉంటున్న వారు 300 మంది ఉన్నారు. వారికి భూమి మీద హక్కు కల్పిస్తూ పట్టాయడం లేదు. కనీసం పక్కా ఇళ్లు నిర్మించుకోవడానికి సహాయం చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు ఇస్తే తమ కుటుంబాలు స్థిరపడతాయని మహిళలు చెబుతున్నారు.



షాపు పెట్టుకోవడానికి సహాయం కావాలి

షేక్ మున్నా, ముస్తాబాద

నేను కార్పెంటర్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. పనిచేస్తేనే కూలీ వస్తుంది. వచ్చే సంపాదన ఇద్దరు పిల్లల చదువుకు, కుటుంబ పోషణకు కూడా సరిపోవడంలేదు. అందువల్ల నేను కార్పెంటర్ షాపు పెట్టుకోవడానికి ఆర్థిక సహాయం అవసరం అవుతుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద ఆర్థిక సహాయం కోసం అనేకసార్లు దరఖాస్తు పెట్టినా ప్రయోజనం లేకుండా పోతోంది. నాకు ఇల్లు కూడా లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నా.



ప్రైవేటు ఉద్యోగం అవసరం ఉంది

సునీత, వెదురుపావులూరు

నాకు భర్త లేడు. ఇద్దరు పిల్లలున్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సహాయం అందడం లేదు. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. ఏదైనా ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం ఇస్తే చేసుకొని పిల్లలను చదివించుకుంటా. ముఖ్యంగా ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు అందులో ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరుతున్నా.



కొట్టు పెట్టుకోవడానికి సహాయం కావాలి

ఏ.సోనియా, రాజీవ్ కాలనీ

మాది నిరుపేద కుటుంబం. అద్దె ఇంట్లో ఉంటున్నాం. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నేను వ్యాపారం చేసుకోవడానికి వీలుగా ఆర్థిక చేయూత అందించాలని అడుగుతున్నాం. బ్యాంకు లోను కోసం దరఖాస్తు చేస్తే ఇవ్వడంలేదు. ప్రభుత్వ పథకాలు రావడం లేదు. ఆర్థిక సహాయం అందిస్తే షాపు పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటాం.

మొదటిపేజీ తరువాయి

నేటి నుండి సింగ్‌నగర్లో పాదయాత్ర

గడిచినా కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైం దన్నారు. ఇప్పటికే బుడమేరు ముంపు నుంచి ప్రజలకు రక్షణ కల్పించలేకపోతోందన్నారు. అధికారుల లెక్కల ప్రకారమే బుడమేరు వరదల్లో 34 మంది చనిపోతే, అనధికారికంగా 50 మందికి పైగా చనిపోయారన్నారు. వేల కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరగడంతో పాటు ఇళ్లు, పంటలు కోల్పోయారని చెప్పారు. అంతేగాక పలు రకాల వ్యాపారాలు దెబ్బతిని లక్షలాది మంది ప్రజలు సర్వం కోల్పోయారని గుర్తుచేశారు. ఏడాది గడిచినా ఇప్పటికీ వరద నష్టం నుంచి ప్రజలు కోలుకోలేదన్నారు. అంతేగాక ఇటీవల కురిసిన వర్షాలతో బుడమేరు వరద మళ్లీ వస్తోందని భయాందోళనతో జనం బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం సింగ్‌నగర్‌కు వరద రాకపోయినా కొద్దిపాటి వర్షాలకే రోడ్లపైకి కొన్నిచోట్ల నీరు రావడం, వంతెనల మీదకు నీరు రావడంతో ప్రజలు ఇళ్లల్లో భయంతో గడపాల్సిన పరిస్థితిని ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. బుడమేరు ముంపు ఉండదని ప్రజలకు భరోసా, నమ్మకం, విశ్వాసం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బుడమేరు ముంపు నివారణ శాశ్వత చర్యలకు కేంద్రం రూ.6,880 కోట్ల ఆర్థిక సహాయం చేయాలని కోరుతూ ప్రధాని మోడీకి స్వయంగా సిఎం చంద్రబాబు లేఖ రాశారని గుర్తు చేశారు. కానీ ఈనాటి వరకు కూడా ఒక్క నయాపైసా కూడా కేంద్రం నుంచి విడుదల కాలేదని దుయ్యబట్టారు. డబుల్ ఇంజన్, త్రిబుల్ ఇంజన్ సర్కారుగా చెప్పుకునే కూటమి ప్రభుత్వం బుడమేరుకు నిధులను ఎందుకు తీసుకురాలేకపోతోందన్నారు. బుడమేరు వరద బాధితుల సహాయార్థం వివిధ సంస్థలు, దాతలు రూ.700 కోట్ల వరకు విరాళాల రూపంలో అందించారని తెలిపారు. ఆ డబ్బును పులిహోర, వాటల్ బాటిళ్లు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, బిస్కెట్లకు ఖర్చు పెట్టేశారన్నారు. కొండపల్లి సమీపంలోని శాంతినగర్‌లో కట్టకు గండిపడితే గండిపూడ్చడానికి రూ.30 కోట్ల నిధులు కేటాయించి ఒక గండి పడిన ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించారన్నారు. దీన్ని వర్షాకాలం ప్రారంభంలో హడావుడిగా ప్రారంభించి వరదను ఆపేశామని చెబుతున్నారని అన్నారు. బుడమేరు వరద శాశ్వత నివారణ చర్యల్లో ఇంత వరకు ప్రాజెక్టు నివేదిక లేదని, కనీసంగా టెండరు పిలవలేదని అన్నారు. వాస్తవంగా పైసా కూడా నిధులు విడుదల చేయలేదని, నేటికీ ఎకరమైన చర్యలు తీసుకోలేదని చెప్పారు. ప్రభుత్వాధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం ఒక సమాంతర కాల్వ నిర్మించాలని, బుడమేరు కృష్ణానదిలో కలిసే డైవర్షన్ ఛానల్ సామర్థ్యాన్ని 17,500 నుంచి 35 వేల క్యూసెక్కులకు పెంచాలని, దానికి రిటైనింగ్ వాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. బుడమేరుకు దిగువన ఎనికేపాడు అండర్ ఛానల్ నుండి కొల్లేరు వరకు, అక్కడి నుంచి ఉప్పుటేరు వరకు సముద్రంలో కలిసే ప్రాంతాల్లో నీటి ప్రవాహ సామర్థ్యం పెంచాలని కోరారు. 40 వేల క్యూసెక్కుల వరద నీరు దిగువకు వెళ్లాల్సి ఉండగా, ప్రస్తుతం ఏడు వేల క్యూసెక్కులు మాత్రమే వెళుతోందన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ కాలయాపన చేయకుండా తక్షణమే బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలకు ప్రభుత్వం పూనుకోవాలని కోరారు. లేకపోతే ప్రజాప్రతినిధులను సింగ్‌నగర్ ప్రాంతంలో అడుగుపెట్టనీయకుండా ప్రజలు తిరగబడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. బుడమేరు వరద ముంపు సమయంలో బాధితులకు సిపిఎం, ప్రజా సంఘాలు అండగా నిలిచి 1.75 లక్షల మందికి 15 రోజులపాటు భోజనం ఏర్పాట్లు చేసి, అన్ని విధాలుగా ఆదుకున్నాయని గుర్తుచేశారు. మీడియా సమావేశంలో సిపిఎం పశ్చిమ, సెంట్రల్ సిటీల కార్యదర్శులు బోయి సత్యబాబు, భూపతి రమణారావు పాల్గొన్నారు.

అక్టోబర్ నాటికి యార్డుల్లో చెత్త తరలింపు

రహదారిపై వెళుతూ మచిలీపట్నంలో కొద్దిసేపు ఆగి లెగసీ వేస్ట్ డంపింగ్ యార్డును మంత్రి నారాయణ స్థానిక నేతలు, అధికారులతో కలిసి పరిశీలించారు. చెత్తను బయో మైనింగ్ చేస్తున్న విధానాన్ని మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి 85 లక్షల లెగసీ వేస్ట్ ఉందని ఇప్పటివరకూ 72 లక్షల టన్నుల చెత్తను తొలగించగా మరో 13 లక్షల టన్నుల చెత్త మిగిలి ఉందన్నారు. మచిలీపట్నం లో మొత్తం 42 వేల టన్నుల చెత్తకు గాను 19 వేల టన్నులు పూర్తిగా తొలగించామన్నారు. ఇక్కడ అదనంగా మెషీన్లు ఏర్పాటు చేసి త్వరితగతిన చెత్త తొలగించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతి రోజూ వచ్చే 7500 టన్నుల సాలిడ్ వేస్ట్ కోసం వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ద్రవ వ్యర్థాల నిర్వహణ కోసం రాబోయే రెండేళ్లలో వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంత్రి వెంట మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఎం వి గోపాలరావు, రాష్ట్ర శిష్టకరణాల సాధికార కమిటీ చైర్మన్, మచిలీపట్నం టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ ఎ.మహంతి రాజా తదితరులు పాల్గొన్నారు.

రొయ్య రైతు విలవిల !

వ్యాధి బారిన పడ్డాయి. రొయ్యలు సరైన ఎదుగుదల లేక దిగుబడులు తగ్గి పోయాయి. మరోవైపు అమెరికా భారత్‌పై టారిఫ్‌లు పెంచిందన్న కారణాన్ని చూపుతూ మార్కెట్లో 100 కౌంట్ రొయ్య ధర కిలో రూ.270 నుంచి 240కి, 40 కౌంట్ ధర రూ.400 నుంచి రూ.350కు వ్యాపారులు తగ్గించారు. దీంతో రొయ్యల సాగుదారులు నష్టాల బారిన పడుతున్నారు.

నష్టాలు ఇలా

కోడూరు మండలం పిట్టల్లంకకు చెందిన జరుగు పోతురాజు 14 ఎకరాల్లో రొయ్యలు సాగు చేశారు. సగటున ఎకరాకు రూ.2.54 లక్షలు ఖర్చుపెట్టారు. కంపెనీలు నాణ్యమైన పిల్లను సరఫరా చేయకపోవడంతో చెరువులో వైట్‌కట్ వైరస్ సోకింది. రొయ్యల్లో ఎదుగుదల లోపించడంతో ముందుగానే పట్టుబడి పట్టారు. ఎకరాకు మూడు టన్నులు దిగుబడి రావాల్సి ఉండగా, కేవలం 700 కిలోలు మాత్రమే వచ్చింది. అలాగే రొయ్యలను విక్రయించే సమయంలో 100 కౌంట్ రొయ్యల ధర కిలో రూ.270 నుంచి రూ.220కి దిగజారింది. దీంతో ఎకరాకు లక్ష రూపాయల చొప్పున రూ.14 లక్షలుల నష్టపోయారు. కోడూరుకే చెందిన నాగం రఘు హంసలదీవిలో ఐదు ఎకరాల్లో రొయ్యలు సాగుచేశారు. ఎకరాకు రూ.50 వేల చొప్పున రూ.2.50 లక్షలు నష్టపోయారు. 20 ఏళ్ల క్రితం 25 కిలోల మేత కట్ట రూ.800 ఉన్న రోజుల్లో 30 కౌంట్ రొయ్యలు కిలో రూ.600 ధర ఉండేదని, మేత కట్ట రూ.2,200కు పెరిగిన క్రమంలో ధరలు కిలో రూ.500కు దిగజారడం, వైరస్ సోకడం కారణంగా నష్టాల బారిన పడుతున్నామని ఆయన వాపోయారు.

పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు

చర్యలేమిటి ?

రాష్ట్ర ప్రభుత్వ సూచనలు, విఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు విజయవాడను పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ, వీధుల శుభ్రత, డ్రైన్లలో డీ సిల్టింగ్, ఇతర వ్యర్థాల తొలగింపు వంటి చర్యలు తీసుకుంటున్నాం. రెండుసార్లు డ్రైన్లలో డీసిల్టింగ్ పనులు జరిగినా మూడోసారి కూడా డీ సిల్టింగ్ పనులు చేయిస్తున్నాం. ప్రధాన డ్రైన్లతోపాటు చిన్న చిన్న డ్రైన్లలో ఈ పనులను అవసరమైన చోట చేపడుతున్నాం. అలాగే ప్రజారోగ్యం, పారిశుధ్య నిర్వహణ మెరుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై ప్రజల్లో వివిధ రూపాల్లో అవగాహన కల్పిస్తున్నాం. సదస్సులు, ఇతర కార్యక్రమాలను నిర్వహించి, వారిలో చైతన్యం తీసుకొస్తున్నాం.

ప్రశ్న : ప్రత్యేకించి వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా, దోమల వ్యాప్తి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ప్రధానంగా వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కమిషనర్ ఆదేశాల మేరకు దోమల నివారణకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాం. యాక్షన్‌ప్లాన్‌కు అనుగుణంగా మలేరియా డివిజన్ ప్రకారం ఒక ఎస్ఐతోపాటు మలేరియా సిబ్బందితో యాంటీ లార్వా ఆపరేషన్, దోమల నియంత్రణలో భాగంగా దోమలు గుడ్లు పెట్టకుండా ఆయిల్ బాల్స్, ఫాగింగ్ స్ప్రేయింగ్, యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. కొండ ప్రాంతాలతోపాటు మురికివాడలు, డ్రైన్లు, శివారు కాలనీల్లోనూ దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సామూహిక గృహాలు, కాల్వల ప్రాంతాల్లో ప్రత్యేకంగా దోమల నివారణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. పూర్తిస్థాయిలో చెత్త తొలగింపు జరుగుతోంది. బుడమేరు తదితర ప్రాంతాల్లో డ్రోన్లను ఉపయోగించి దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇళ్లల్లోని మరుగుదొడ్ల పైపుల ద్వారా దోమలు జొరబడకుండా నైలాన్ లాంటి క్లాత్‌ను పైప్‌లకు అమరుస్తున్నాం.

ప్రశ్న : కుక్కల బెడద నివారణ, వాటి ఉత్పత్తి తగ్గింపుకు, కబేళా స్లాటర్ హౌస్ నిర్వహణ ఎలా ఉంది?

వీధుల్లో ఆవులు, గేదెలు తిరగకుండా, పాదచారులకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు వీలుగా సింగ్‌నగర్లో ఉన్న షెడ్‌కు వాటిని తరలిస్తున్నాం. కుక్కల నియంత్రణకు ఎప్పటికప్పుడు ఆపరేషన్లు చేయిస్తున్నాం. అలాగే కోతుల బెడద నివారణకు కూడా చర్యలు తీసుకుంటున్నాం. స్లాటర్ హౌస్ (కబేళా)లో జంతువుల వ్యర్థాలు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నాం. మరింత మెరుగుదల కోసం దానిని ఆధునీకరించాల్సి ఉంది.

ప్రశ్న : నగర పాలక సంస్థ పరిధిలోని ఆయుర్వేద, యునాని, అల్లోపతి ఆస్పత్రుల్లో వైద్యసేవల మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలేమిటి ?

నగరపాలక సంస్థ పరిధిలో 12 ఆయుర్వేద వైద్యశాలలతోపాటు మరో రెండు యునాని, మూడు అల్లోపతి ఆస్పత్రులు ఉన్నాయి. వాటి ద్వారా వైద్యసేవలు అందిస్తున్నాం. వీటి పర్యవేక్షకులు, మందులు అందుబాటులో ఉండేలా డాక్టర్లు, ఇతర సిబ్బందిని భర్తీ చేస్తున్నాం. వైద్యసేవలు సక్రమంగా ప్రజలకు అందేటట్లు చర్యలు తీసుకుంటున్నాం.

పోలీస్‌స్టేషన్ ముందు రైతు ఆత్మహత్యాయత్నం



చికిత్సపొందుతున్న రైతు నరసింహరాజు

ప్రజాశక్తి-కోడూరు : పోలీస్‌స్టేషన్ ముందు రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన దివిసీమలో సంచలనంగా మారింది. పొలం గట్ల విషయమై ఇరు రైతుల మధ్య తలెత్తిన వివాదంలో తనకు పోలీసులు అన్యాయం చేశారని ఒక రైతు మనస్థాపంతో కోడూరు స్టేషన్ వద్దే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన ఆదివారం సాయంత్ర కోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం కోడూరు గ్రామానికి చెందిన చిట్టిప్రోలు నరసింహరాజుకు జరుగువానిపాలెం గ్రామానికి చెందిన జరుగు వెంకటేశ్వరరావుకు జరుగువానిపాలెంలో సమీపంలో ఉన్న పోలం మధ్య గట్ల విషయంలో గత కొంతకాలం నుంచి వివాదం జరుగుతుంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతుండగా ఇరువురు రైతుల పోలాల మధ్య ఉన్న గట్టును వెంకటేశ్వరరావు నరికి వేశాడు. దీంతో ఈ విషయంపై నరసింహరాజు స్థానిక పోలీస్ స్టేషన్ లో మూడు రోజులు కితం ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసులు ఈ విషయాన్ని పట్టించుకోకుండా వెంకటేశ్వరరావుకు కొమ్ముకాశారు అని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇదే అదునుగా చేసుకొని వివాదం పరిష్కారం కాకుండానే వెంకటేశ్వ రరావు తన పోలంలో శనివారం వరినాటు వేశాడు. దీంతో పోలీసులు తన సమస్యను పరిష్కరించలేదంటూ మనస్తాపానికి గురైన నరసింహరాజు ఆదివారం సాయంత్రం తన వెంట తీసుకువెళ్లిన పురుగు ముందును స్టేషన్ ఎదుట తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నరసింహరాజు పురుగు మందు తాగుతున్న సమయంలో అవనిగడ్డ సీఐ యువకుమార్ కూడా స్టేషన్లనే ఉన్నారు. పురుగు మందు తాగిన బాధితుడిని పోలీసులే హుటాహుటినా అవనిగడ్డలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలం గట్ల విషయంలో పోలీసులు న్యాయం చేయకపోగా తనపైనే తిరిగి కేసు నమోదు చేసేందుకు ప్రయత్నించారని, దీంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగినట్లు బాధితుడు నరసింహరాజు తెలిపాడు. పోలీస్ స్టేషన్ ముందే రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినా కూడా ఘటనపై కేసు నమోదు చేయలేదని స్థానిక పోలీసులు మీడియాకు తెలిపారు. కోడూరు పోలీసులు ఆసుపత్రికి వచ్చి సెట్మెంట్ను రికార్డు చేశారని, కాని కేసు నమోదు చేయకపోవడంపై బాధిత రైతు నరసింహరాజు ఆవేదన వ్యక్తం చేశాడు.



పందిళ్ల వద్ద సూచనలిస్తున్న పోలీసులు

ఇబ్బందులు కలిగిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-చల్లపల్లి : వినాయక చవితి ఉత్సవ పందిళ్లను చల్లపల్లి సిఐ కె. ఈశ్వరరావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం పోలీస్ సిబ్బందితో ఆదివారం సందర్శించారు. పందిళ్ల నిర్వాహకులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువత మద్యం సేవించి ర్యాలీలు లాంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు హెచ్చరించారు. వినాయకుల పందిరిల వద్ద యువత డీజే లు మైక్ సెట్‌లో పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా ఉండాలని తగు సూచనలు చేశారు. **ప్రజాశక్తి- నందివాడ :** వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు అన్నారు. ఆదివారం నందివాడ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాలకు పోలీసుల అనుమతి తీసుకొని మైకులు సౌండ్ బాక్స్‌లు వంటివి పెట్టుకోవాలన్నారు. ఎస్ఐ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



విరిగిన వంతెన

విరిగిపడిన వంతెన

ప్రజాశక్తి -నందివాడ : మండలంలోని నేహరాలి కాల్వపై వంతెన ఆదివారం ఉదయం ఒక్కసారిగా సగానికి విరిగిపడింది. అటువైపుగా వెళ్లే భారీ వాహనాలకు అంతరాయం ఏర్పడింది. దీంతో అధికారులు ఆ ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేసి భారీ వాహనాలను నిలిపివేశారు. వాహనాలకు అంతరాయం కలగకుండా వంతెన పక్కనుండి రెండు రోజుల్లో తాత్కాలికంగా వాహనాలు వెళ్లేందుకు మార్గం నిర్మిస్తామని అధికారులు తెలిపారు. డిసెంబర్ నెలలో కొత్త వంతెన నిర్మాణం చేపడతామని అధికారులు వెల్లడించారు.

వ్యాయామంతో ఆరోగ్యం : ఎస్‌పి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : పోలీసులు, ప్రజలు వారి దినచర్యలో వ్యాయామం ఒక భాగంగా మార్చుకొని పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు సూచించారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల యొక్క ఉత్తర్వుల మేరకు "ఫిట్ ఇండియా" లో భాగంగా, కృష్ణా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 'సండే ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు 24 గంటలు విధుల్లో ఉంటారని, వారిలో శారీరక దృఢత్వం మానసిక ఉల్లాసం చాలా అవసరం అన్నారు. అందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సైక్లింగ్ ద్వారా శరీరం ఆరోగ్యంగా ఉండటమే కాకుండా, ఒత్తిడి తగ్గుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వారానికి కనీసం ఒకరోజు అయినా సైక్లింగ్, వ్యాయామం, క్రమబద్ధమైన శారీరక శ్రమకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తతం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ , బందరు డిఎస్పి సిహెచ్ రాజా , పట్టణ ఇన్స్పెక్టర్లు రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ధర్నాను జయప్రదం చేయాలని కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-మోపిదేవి : రజకులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీలు అమలు జరపాలని కోరుతూ 25వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు కష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రజక వత్తిదారుల సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామంలోని అంకాలమ్మ తల్లి గుడి దగ్గర ధర్నా బ్రోచర్ను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అవనిగడ్డ రజనీకాంత్, రజక వత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అవనిగడ్డ రజనీకాంత్, కల్లేపల్లి లక్ష్మి రజిక వత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షురాలు కల్లేపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టమోటా ధరల మోత

ప్రజాశక్తి-గన్నవరం : టమోటా ధరలు భారీగా పెరుగుతున్నాయి. వారం క్రితం వరకు కిలో 20 నుంచి 30 రూపాయలు పలికిన కిలో టమాటా ధర ఇప్పుడు భారీగా పెరిగింది. గత 15 రోజుల్లో టమాటా ధర డబుల్ అయిపోయింది. ప్రస్తుతం మార్కెట్లో కిలో టమాటా 60 నుంచి 70 రూపాయలు పలుకుతుంది. కాగా, డిమాండ్ కు సరిపడ టమాటా రాకపోవడమే ఇందుకు కారణమని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు. ఇక, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టమాటా పంటలు దెబ్బతిన్నా యని.. దీంతో ధరలు అమాంతం పెరిగాయని పేర్కొంటున్నారు. గన్నవరం మండలంలోని గొల్లనపల్లి, బిబి గూడెం, సూరంపల్లి, ముస్తాబాద్, చన్నుపల్లి వారిగూడెం, పురుషోత్తపట్నం, వియంపురం, గన్నవరం గ్రామాల్లో టమాటా పండిస్తారు. దీనికి తోడు హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు జిల్లాలు, రాయలసీమ, కర్ణాటక, మహారాష్ట్ర లో కూడా వానలకు టమాటా పంట దెబ్బతింది. దీంతో దిగుబడి కూడా ఆగిపోవడంతో ధరలు పెరిగినట్లు కూరగాయల వ్యాపారులు పేర్కొంటున్నారు. కాగా విజయవాడ, హనుమాన్ జంక్షన్, కంకిపాడు లాంటి మార్కెట్లో కేజీ టామాట ధర రూ. 50 నుంచి 60 వరకు పలుకుతుంది. ఇక, మిగతా చోట్ల రూ. 45 వరకు పలుకుతుంది. పెరిగిన ధరలతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. సెకండ్ కేటగిరి టమాటాలు మార్కెట్లోకి రావడంతో వ్యాపారులు వాటిని అధిక ధరలకు విక్రయిస్తున్నారని చెప్తున్నారు. రైతు బజార్లో కూడా రేట్లు బాగానే పెరిగాయని అంటున్నారు. వర్షాల ప్రభావంతో బీరకాయ తోటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం బీర కిలో 50 నుంచి 60 రూపాయల వరకు పలుకుతోంది.





సిపిఎం సీనియర్ నాయకులు బలగం మృతి

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని పొణు కుమాడుకు చెందిన సిపిఎం సీనియర్ నాయకులు బలగం సత్యనారాయణ (85) తన స్వగృహంలో శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి వి లక్ష్మణస్వామి, పార్టీ మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు పిల్లి రాజారావు, గ్రామ పార్టీ నాయకులు పడమట సత్యనారాయణ, చెన్నకేశవరావు, పైడేశ్వరరావు, పరమేశ్వరరావు తదితరులు సత్యనారాయణ భౌతిక కాయానికి నివాళులర్పించారు.

మృతుడికి నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని లంకమ్మ మాన్యానికి చెందిన వైసిపి ఎస్టీ సెల్ నాయకులు ప్రసాదు గుండెకు సంబంధించిన అనారోగ్యంతో వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు లంక మామయ్యలోని ప్రసాదుకు ఇంటికి వెళ్లి ఆయన మతదేహంపై పూలదండ వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆ పార్టీ నాయకులు జిల్లా వైఎస్ఆర్ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి గాజుల జయ గోపాల్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు చింతలపూడి బాల భాస్కరరావు పాల్గొన్నారు



నివాళులర్పిస్తున్న మాజీ ఎంఎల్ఎ సింహాద్రి రమేష్

కుటీర పరిశ్రమగా మట్టి వినాయక విగ్రహాల తయారీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలోని ఏ గ్రామంలో ఎక్కడ చూసినా మట్టి వినాయకులే దర్శనమిస్తున్నాయి. భక్తుల మనసు దోచుకునే ఆకతుల్లో కొలువుదీరేందుకు బొజ్జగణ పయ్యలు సిద్ధమవుతున్నారు. వీరవల్లి లో 40 కుటుం బాలు 18 ఏళ్లుగా మట్టి వినాయకులు తయారు చేస్తు న్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినా యకులే అందరూ పెడితే పర్యావరణం పరిరక్షిస్తారని అంటున్నారు. దీనిలో భాగంగానే తాము మట్టి వినాయకుల తయారు చేసి విక్రయాలు చేస్తామని వై.లక్ష్మి అంటున్నారు. స్థానికంగా చెరువులో నల్ల మట్టిని, ఎర్ర మట్టిని తీసుకువచ్చి కొత్త కొత్త విధానాలతో కొత్త మోడల్స్ విగ్రహాలు తయారు చేస్తామని శివ నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది పెద్ద విగ్రహాలు తయారు చేస్తున్నామని చెప్పారు. తమ వద్ద మట్టి విగ్రహాలు 3 అడుగుల నుండి 6 అడుగుల వరకు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని అన్నారు.



నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఈ నెల 25వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు.

7న దుర్గ గుడి మూసివేత

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం సెప్టెంబర్ 7న చంద్ర గ్రహణం కారణంగా మూసివేయబడుతుంతుందని, మధ్యాహ్నం 3:30 గంటల నుంచి ప్రధాన ఆలయంతోపాటు అన్ని ఉపాలయాలను మూసివేస్తున్నట్లు ఇఒ శీనానాయక్ తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3:30 గంటలకు కవాట బంధనం ఉంటుందన్నారు. తిరిగి సెప్టెంబర్ 8న ఉదయం 8:30 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం లభిస్తుందని అధికారులు తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-విజయవాడ

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం విజయవాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతోపాటు జోనల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థకు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని, ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని తెలిపారు. అధికారులందరూ జోనల్ కార్యాలయలతో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కృష్ణా జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులుగా వెలగపూడి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

ఎన్నో క్రీడాంశాలలో నగర క్రీడాకారులు జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు పెంపొందించిన స్థాయిలోనే బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు కూడా కష్ణాజిల్లాను జాతీయ స్థాయిలో నిలపాలని కృష్ణా జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు వెలగపూడి వెంకటేశ్వరరావు అన్నారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆదివారం అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షునిగా ఎన్నికైన ఆయన మాట్లాడుతూ ఔత్సాహిక, వర్ధమాన క్రీడాకారులను గుర్తించేందుకు గ్రామీణ ప్రాంతాలలో క్రీడా శిబిరాలు నిర్వహించాలన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు జిల్లా అసోసియేషన్ ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. రానున్న రోజుల్లో బాల్ బ్యాడ్మింటన్ క్రీడ పునరుజ్జీవం పొందేలా తమ కార్యవర్గం కషి చేస్తుందన్నారు. ఎన్నికల అధికారిగా నిమ్మగడ్డ దుర్గాప్రసాద్ వ్యవహరించగా కార్యదర్శిగా ఎం.శివశంకర్, కోశాధికారిగా బి.రమేష్, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కోగంటి బాబు, గురునాథంలకు మిత్ర బృందం సన్మానం

ప్రజాశక్తి-కంచికచర్ల

కంచికచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ కోగంటి బాబు, మండల విద్యాశాఖాధికారి జి గురునాథం సన్మాన కార్యక్రమం ఆదివారం స్థానిక ఓసి క్లబ్‌లో జరిగింది. 1982 లో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుకున్న మిత్ర బృందం ఆధ్వర్యంలో అభినందన సన్మానం జరిగింది. నన్నపనేని దుర్గారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ తమతో కలిసి చదువుకున్న కోగంటి బాబు రాజకీయంగా ఉన్నత స్థానంలో, గురునాథం విద్యాశాఖలో ఉన్నత స్థానంలో ఉండి ప్రజాసేవలో తమవంతు పాత్ర పోషించటం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- **సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు**

విజయవాడ : సంక్షేమ బోర్డును పునరుద్ధరించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విజయవాడ తూర్పు నగర 12వ మహాసభ బందర్ రోడ్డులోని ఎపి వెటర్నరీ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం జరిగింది. మహాసభకు ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దోనపూడి కాశీనాథ్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఎన్‌టిఆర్ జిల్లా కన్వీనర్ ఎ.కమల, బిల్డింగ్ వర్కర్ సీనియర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పారావు, బిల్డింగ్ సిటీ అధ్యక్షులు వి.బి.రాజు, కార్యదర్శి బి.బెనర్జీ, సిఐటియు సిటీ కార్యదర్శి కోట బాబు, సిఐటియు సిటీ నాయకులు పి.కృష్ణ, ఎన్.నాగేశ్వరరావు పాల్గొన్నారు. బిల్డింగ్ రంగంలో అమరులైన కోసూరు రాఘవయ్య, కంభంపాటి నాగ రాజారావు చిత్రపటాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాసభ సందర్భంగా కార్మికులు రాణిగారి తోట నుండి ఎపి వెటర్నరీ అసోసియేషన్ హాల్ వరకు బిల్డింగ్ ర్యాలీ నిర్వహించారు. మహాసభను ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కార్మికులకు అమలవుతున్న పలు కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లు అమలైతే సంక్షేమ బోర్డులు నిర్వీర్యమవుతాయని, కార్మికులు హక్కులను కోల్పోతారని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును పనిచేయించి పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డులు నిర్వీర్యం కాకూడదంటే కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న లేబర్ కోడ్‌లు అమలులోకి రాకుండా పోరాడాలని పిలుపునిచ్చారు.



సభలో మాట్లాడుతున్న బాబూరావు

సంక్షేమ పథకాలు అమలు చేయాలి : కాశీనాథ్



కార్మికుల సంక్షేమ పథకాలను అమలు చేయాలని దోనేపూడి కాశీనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టంలో నిర్మాణ ప్రదేశంలో కార్మికులకు తాత్కాలికంగా వసతి, తాగునీరు, మరుగు దొడ్ల వంటి కనీస సదుపాయాలను యజమాని కల్పించాలని, వెల్ఫేర్ బోర్డు నుంచి కార్మికుల సమితి నిర్మాణానికి రుణాలు, అడ్వాన్సులు, పిల్లల చదువులకు స్కాలర్ షిప్‌లు ఇవ్వాలని, 1214 మెమోను రద్దు చేసి కార్మికుల సంక్షేమ పథకాలను అమలు చేయాలని, నిలిపివేసిన క్లెయిమ్‌లకు వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



నూతన కమిటీ ఎన్నిక



మహాసభ అనంతరం సంఘం గౌరవ అధ్యక్షులుగా వి.గురుమూర్తి ఎన్నికయ్యారు. తూర్పు సిటీ ప్రధాన కార్యదర్శిగా విబి.రాజు, తూర్పు సిటీ అధ్యక్షులుగా టి.బుచ్చి బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.బెనర్జీ, తూర్పు సిటీ ఉపాధ్యక్షులుగా యాల్లారావు, జె.ప్రవీణ్, వి.రాజేష్, బి.హుసేన్, ఆదినారాయణ, సహాయ కార్యదర్శిగా అప్పన్న, వి.కొండ, యమ్. నాగమల్లేశ్వరరావు, అప్పలస్వామి, కె.విజయ్ కుమార్, యన్.నరసింహారావు, మహానాడు అప్పన్న, వాసు, వెంగళరెడ్డి, కోశాధికారిగా ఏడుకొండలు, వీరితోపాటు 25 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

మధుమేహ వైద్యం.. పూర్తిగా ఆధునికం

- **డయాబ్ ఎండోకాన్ సదస్సులో డాక్టర్ యలమంచి సదాశివరావు**

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ

మధుమేహ వైద్యం అత్యంత ఆధునికతను సంతరించుకుందని, షుగర్ వ్యాధి గురించి భయపడాల్సిన అవసరం ఇక ఎంత మాత్రం లేదని ప్రఖ్యాత డయాబెటాలజిస్ట్, యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ యలమంచి సదాశివరావు అన్నారు. యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డయాబ్ ఎండోకాన్ 2025 సదస్సు నిర్వహించారు. లబ్బీపేటలోని హోటల్ జీఆర్టీ గ్రాండ్‌లో ఆదివారం జరిగిన ఈ సదస్సులో డాక్టర్ సదాశివరావు ప్రసంగిస్తూ.. అధునాతన చికిత్సలతో మధుమేహ వ్యాధిగ్రస్తుల జీవితాల్లో కొత్త వెలుగులు విరబూస్తాయని అన్నారు. త్వరితగతిన శరీర బరువు తగ్గించేందుకు ఇంజెక్షన్లు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇన్సులిన్ ఇంజెక్షన్ల నుంచి త్వరలో విముక్తి లభిస్తుందని, ఇన్సులిన్ సులువుగా తీసుకోగలిగేలా ఇన్హేలర్లు



అమర్‌పాల్ సింగ్‌కు మెడల్ ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. ఈ సదస్సులో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన జాతీయ స్థాయి వైద్య నిపుణులు పలు అంశాలపై ప్రసంగించారు. ఆధునిక చికిత్సా పద్ధతులు, నూతన ఆవిష్కరణల గురించి విశ్లేషించారు. ఈ ఏడాది ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ అమర్ పాల్ సింగ్‌కు గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. ఈ సదస్సులో వైడిఆర్ఎఫ్ జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ హిమన యలమంచి, సెక్రటరీ ఐశ్వర్య యలమంచి, జాయింట్ సెక్రటరీ అమూల్య యలమంచి పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

విజయవాడ పశ్చిమ డివిజన్‌లో ఎసిపి దుర్గారావు ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. నేరచరిత్ర కలిగిన రౌడీషీటర్లపై ఎల్లప్పుడూ నిఘా ఉంటుందని తెలిపారు. రానున్న వినాయక చవితి వేడుకలలో అవాంఛనీయ సంఘటనలలో పాల్గొనకూడదని, రాజకీయ పార్టీలకు సంబంధించిన ర్యాలీలలో పాల్గొనవద్దని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మద్యానికి బానిసలు కాకుండా బాధ్యతగా మెలగాలని సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాల వ్యాపారం జరుగుతున్నట్లయితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ గురుప్రకాష్, కొత్తపేట సీఐ చిన్న కొండలరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ క్యాంప్‌లు ప్రారంభం

ప్రజాశక్తి-వత్సవాయి

సుబ్బయ్య గూడెం, శనగపాడు, నవాబుపేట సచివాలయ పరిధిలో శనగపాడు గ్రామ సచివాలయంలో క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జి ఎంపీడీవో సిద్ధారెడ్డి తెలిపారు. ఈ నెల 30 వరకు నిర్వహిస్తామని తెలిపారు ఈ నెల 25న అనిగండ్లపాడు-1, అనిగండ్లపాడు -2 వారికి అన్నిగండ్లపాడు సచివాలయం వన్‌లో ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 26న గుమ్మడిదూరు, ముచ్చింతాల, శివపురం సచివాలయాలలో పరిధిలోని వారికి అనీగండ్ల పాడు-1 సెంటరుకు కేటాయించినట్లు తెలిపారు. 28న పెనుగంచిప్రోలు ఒకటి, రెండు, సచివాల యాలతోపాటు లింగగూడెం సచివాలయ పరిధిలోని వారికి పెనుగంచిప్రోలు సచివాలయం 3కి సెంటర్ కేటాయించినట్లు చెప్పారు.

ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఆధునీకరణ

- **త్వరలో కేన్సర్ ఇన్సిస్టిట్యూట్ ప్రారంభం**

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ

రాష్ట్రంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌ను క్యాన్సర్ చికిత్స, బహుళ అవయవ మార్పిడి రంగాలలో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దడం తమ ప్రధాన లక్ష్యమని ఆస్టర్ ఇండియా మెడికల్ అడ్వైజరీ బోర్డు చైర్మన్, ఆస్టర్ ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్ డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. మరో వెయ్యి పడకల సామర్థ్యంతో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌ను ఆధునీకరిస్తామని చెప్పారు. విజయవాడ మహాత్మా గాంధీ రోడ్‌లోని ఓ హోటల్‌లో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఒక ప్రత్యేక కార్డియో అంకాలజీ విభాగాన్ని ఏర్పాటు చేస్తోందని అన్నారు. విజయవాడ, గుంటూరు, ఒంగోలులో అంకాలజీ, కార్డియాక్ సర్జరీ, న్యూరోసర్జరీ, గైనకాలజీ, గ్యాస్ట్రోఇంటెస్టినల్ సర్జరీ, హెడ్‌అండ్‌నెక్, ఊపిరితిత్తుల సర్జరీల కోసం



అత్యాధునిక రోబోటిక్ సేవలను ప్రవేశపెట్టిందన్నారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ను అస్టర్ రమేష్ హాస్పిటల్స్ గుంటూరులో త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. విస్తరణలో భాగంగా రాష్ట్రంలో మరొక వెయ్యి అదనపు పడకలను జోడించడమే కాకుండా, గ్రామీణ ప్రాంత ప్రజల ప్రివెంటివ్ హెల్త్ కేర్‌పై దృష్టి సారిస్తోందన్నారు. రమేష్ హాస్పిటల్స్ ఛైర్మెన్ ఎంఎస్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో రెండు ట్రస్ట్‌ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక పథకమైన పి4 సేవలకు మరింత సహకారాన్ని అందిస్తోందన్నారు.

విజృంభిస్తున్న వ్యాధులు

- ఆర్థికంగా కృంగిపోతున్న పేదలు



దోమలకు నిలయమైన డ్రైనేజీ

ప్రజాశక్తి-గన్నవరం : దోమల కారణంగా విజృంభించే జ్వరాలు ఎన్నో కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. వైద్యం ఖరీదైన వస్తువుగా మారడంతో ఎంతో మంది పేదరికంలోకి జారుకుం టున్నారు. కూడ బెట్టుకున్న సొమ్మంతా జ్వరాలతో రోజుల్లోనే హరించు కుపోతోంది. మరోవైపు దోమల నివారణకు ప్రభుత్వం, స్థానిక సంస్థలు ఏటా రూ.కోట్లు నీళ్లలా ఖర్చు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో, కుట్ట కుండా కాదు.. కీటకాలు పుట్టకుండా జాగ్రత్తపడటమే మేలని వైద్యులు అంటున్నారు.

ఏటా రూ. 30 లక్షలు ప్రజాధనం నీళ్లలా వ్యయం..

దోమల కారణంగా జ్వరాల బారినపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందినా, స్థానిక సంస్థలు లార్వాల నివారణకు ఏ ఖర్చుచేసినా.. అదంతా ప్రజల సొమ్మే. సుమారు 4 లక్షల జనాభా గల గన్నవరం మండలంలో దోమల మందు పిచికారీ, ఆయిల్ బాల్స్ వేసేందుకే నెలకు రూ. లక్ష ఖర్చుచేస్తున్నారు. నివారణ చర్యలకు ఏటా అయ్యే ఖర్చు సుమారు రూ.30 లక్షలు. కార్మికుల వేతనాలు దీనికి అదనం. దోమలపై సమరానికి 21 పంచాయతీల్లో రూ.30 నుంచి 35 లక్షలు, అవుతుండగా కేవలం గన్నవరం, కేసరపల్లి, బుద్ద వరం, ముస్తాబాద, సూరంపల్లి మేజర్ పంచాయతీల్లో ఏడాదికి రూ. 17 లక్షలు వరకు ఖర్చవుతుందని అంచనా. అయితే దోమలు చావడం లేదు కానీ ప్రజాధనం మాత్రం ఖర్చయిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు జనాలు.

ఆస్పత్రి పాలైతే అంతే : దోమల నుంచి రక్షణకు గన్నవరంలో ఒక కుటుంబం నెలకు కనీసం రూ.150-రూ.300 వరకు వ్యయం చేస్తోంది. మండ లంలో 2 లక్షల కుటుంబాలున్నాయి. వీటిల్లో కనీసం సగం కుటుంబాలు కాయిల్స్, పేపర్లు, ఆయింట్మెంట్లు, బ్యాట్లు, దోమతెరలు వంటివి ఉపయోగిస్తున్నారు. అందు కయ్యే వ్యయం రూ. కోట్లల్లోనే ఉంటుంది. జ్వరాలకు పొందే చికిత్స ఖర్చులను చూస్తే.. మలేరియా, డెంగీ, గున్యాలో ఏ రకం అనేదాన్ని బట్టి ఉంటోంది. తీవ్ర సమస్యతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరితే వైద్యఖర్చులకు కనీసం రూ.20 వేల నుంచి రూ.60 వేల వరకు భరించాల్సి వస్తోంది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్య సదుపాయాలు, సర్జన్ డాక్టర్లు, ఎండీలు లేకపోవడంతో జనానికి సరైన వైద్యం అందడం లేదు. అక్కడ రోగం తగ్గకపోతే ప్రైవేట్ ఆసుపత్రులకు వద్దకు వెళ్లి వేలకు వేలు అప్పులు చేసి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. మందుల షాపు వద్దకు వెళితే వాళ్లు కూడా ఏదో మందులు ఇచ్చి వందలు లాగేస్తున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి:
డాక్టర్ శ్రీనివాసరావు

ఇంట్లో, పరిసరాల్లో శుభ్రత చర్యలు పాటిం చాలి. మరుగుదొడ్ల గ్యాస్ పైపులకు, కిటికీలకు దోమ తెరలు బిగించుకోవాలి. కీటకాలను అరికట్టే మొక్కల్ని పెంచుకుంటూ, నిండైన వస్త్రాలు ధరించడం మేలు. జ్వర లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సకాలంలో.. సరైన చికిత్స పొందడం ఉత్తమం. వారానికోసారి నిల్వ నీటిని పారబోసి పాత్రలను ఆరబెట్టాలి. డ్రైడే విధిగా కొనసాగించాలి. ఇంటి పరిసర ప్రాంతాల్లో మొరుగు నిలపడకుండా చూసుకోవాలి. అవసరమైతే మురుగు కాలవల్లో మందు చల్లాలి.

ముస్సిపాల్టీలో ప్లాస్టిక్ భూతం



డ్రైన్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు

ప్రజాశక్తి - గుడివాడ : ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తూ గుడివాడ పరిశుభ్రతను తీవ్రంగా దెబ్బ తీస్తోన్న నిషేధిత ప్లాస్టిక్ భూతం అంతకంతకూ పెరిగిపోతుంది. ఎక్కడ చూసినా గుట్టలు గుట్టలుగా కవర్లు, బాటిళ్ళు, సంచులు ఇతర నిషేధిత వస్తువులు పోగుప డుతున్నాయి. ఏటా వందలాది ప్లాస్టిక్ టన్నుల వినియోగంతో మున్సిపాలిటీ మొత్తం కాలుష్య కోరల్లోకి చేరి భయానక పరిస్థితి కనిపిస్తుంది. మున్సిపాలిటీలోని డ్రైన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు తిష్ట వేసుకోవడంతో మురుగునీరు పారుదల లేక పురవీధులు సైతం చెత్తా చెదారాలతో నిండి వీధులలో మురుగునీరు ప్రవహిస్తోంది. కాలువలను, డ్రైన్‌లను శుభ్రం చేసిన ప్రతిసారీ క్వింటాళ్ల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు బయట పడుతున్నాయి. చిన్న, పెద్ద, మధ్యతరహా కాలువల్లో టన్నులకొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు చేరుతున్నాయి. పట్టణంలోని అన్ని మ్యాన్ హెూల్‌ల నిండా అవే వ్యర్థాలు పేరుకుపోయి మురుగు వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్నాయి. అధికారులకు గుర్తుకు వచ్చినప్పుడల్లా మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహిత నగరంగా చేయాలనే ఆలోచన చేస్తూ మరల అలాగే వదిలేస్తూ ఉండటం ఆనవాయితీగా మారింది. మున్సిపాలిటీకి కమిషనర్‌లు మారిన ప్రతిసారీ మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహితంగా మార్చాలని అప్పుడప్పుడూ ఇచ్చే చిన్న చిన్న ప్రకటనలకే పరిమితం అవుతుంది. ఇప్పటికైనా మున్సిపాలిటీ ఉన్నత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విగ్రహాల ఆవిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ మండలి బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-ఘంటసాల : పేదలకు విస్తత సేవలు చేసిన సేవామూ ర్తులు మాలెంపాటి సీతారామాంజనేయులు, అత్తలూరి వెంకట పిచ్చియ్యలు చిరస్మర ణీయులని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం ఘంటసాల మండలం గోగినేనిపాలెంలో మాజీ సీడీసీ చైర్మన్ మాలెంపాటి సీతారా మాంజనే యులు కాంస్య విగ్రహావి ష్కరణ, యన్.జి. రంగా జిల్లా పరిషత్ హైస్కూల్ వ్యవస్థాపకులు దివంగత అత్తలూరి వెంకట పిచ్చియ్య విగ్రహావిష్క రణల మహెూత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి సీతారామాంజనేయులు, అత్తలూరి వెంకట పిచ్చియ్య విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామాంజనేయులు గోగినేనిపాలెం గ్రామ ప్రథమ సర్పంచుగా ఈ గ్రామ అభివద్ధికి విస్తత కషి చేశారన్నారు. అత్తలూరి వెంకట పిచ్చియ్య కషితో ఈ గ్రామంలో ఏర్పడిన యన్.జి.రంగా జిల్లా పరిషత్ హైస్కూల్ వేలాది మంది పేద విద్యార్థుల జీవితాల్లో విద్యా వెలుగులు నింపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయులు, గొర్రెపాటి విద్యా ట్రస్ట్ చైర్మన్ గొర్రెపాటి రంగనాథబాబు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

భరోసా ఏదీ...?

- ఉచిత బస్సులతో ఆటో కార్మికులకు ఉపాధి కరువు
- ఎన్నికల హామీని నెరవేర్చని కూటమి ప్రభుత్వం



ప్రజాశక్తి - గుడ్లవల్లేరు : స్త్రీ శక్తి పేరిట మహిళా ప్రయాణికులకు ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశ పెట్టిన కూటమి ప్రభుత్వం ఆటో వర్కర్ల కడుపు కొట్టింది. ఈ దెబ్బతో 30 ఏళ్లగా ఆటో తోలుకుంటూ బతుకుతూ... కుటుంబ పోషణ చేసుకుంటున్న ఆటో వర్కర్ల కుటుం బాలెన్నో రోడ్డున పడ్డాయి. కిరాయిలు లేక ఆటోలను ఇళ్ల వద్ద పెట్టుకుంటున్నారు. దీనితో ఆ ఆటోలకు చెల్లించవలసిన ఈఎంఐలు చెల్లించక పోవటంతో ఫైనాన్షియర్లు ఆటోలను వెనక్కి లాక్కునే అవకాశం ఉందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావటం లేదని ఆందోళనకు గురవుతున్నారు.

అమలు చేయని ఎన్నికల హామీ

కూటమి అధికారంలోకి వస్తే వివిధ పథకాలతో పాటు ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లు, హెవీ లైసెన్స్ కలిగిన లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని చంద్రబాబు మొన్నటి ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అంతేగాక సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రమాద బీమా, ఆరోగ్యబీమా, డ్రైవర్ల పిల్లలకు విద్యార్థుల చదువులకు రుణాలు, తదితర హామీలను గుప్పిస్తూ...మేనిఫెస్టోలో పేర్కొన్నారు. గుడ్లవల్లేరు మండలంలో వాహన మిత్ర పథకం ద్వారా 2019 నుంచి 2023 వరకు ఐదేళ్ల పాటు 2,534మంది లబ్దిదారులకు రూ.12.67కోట్ల సాయాన్ని గత వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి సీఎం జగన్ అందించారు.

హామీని అమలు చేయాలి
బోడపాటి జోషి, ఆటో కార్మికుడు



కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోతున్నా మాకు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటి వరకూ ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం కింద పథకానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి రూ.15వేలు ఆర్థిక సహాయం అందించాలి.

ఉచిత బస్సు పథకంతో ఇబ్బందులు పడుతున్నాం
లుక్కా కొండ, ఆటో కార్మికుడు



అసలే కిరాయిలు లేక... ఈఎంఐలు కట్టుకోలేక పోతు ంటే మూలిగే నక్క మీద తాటి కాయలా ఉచిత బస్సు పథకాన్ని పెట్టారు. మహిళలు ఎవరూ ఆటోలను ఎక్కటం లేదు. కిరా యిలు పూర్తిగా పడిపోయాయి. ప్రభు త్వం ఆటో కార్మికులను ఆదుకోవాలి.



పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద వరద ప్రవాహం

కొనసాగుతున్న వరద

ప్రజాశక్తి-అవనిగడ్డ : గత నాలుగు రోజుల నుండి కృష్ణానదికి వరద నీరు యధావిధిగా కొనసాగుతోంది. పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద వంతెనకు సమాంతరంగా 16.5 అడుగుల నీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే నదీ గర్భంలోని గ్రామాలు ప్రధానంగా పాత ఎడ్ల లంకకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఆ గ్రామస్తులు అవనిగడ్డ రావాలంటే పడవపై ప్రయాణించి ఒడ్డుకు చేరుకోవాల్సి వస్తుంది. దీనితో వారు ప్రభుత్వం పై అసహనంతో ఆందోళన చేపట్టారు. మరోవైపు నదీ పరివాహక ప్రాంతంలోని గ్రామాలైన పులిగడ్డ, పల్లెపాలెం, రేగులంక, వసుమట్ల, దక్షిణ చిరువాలంక పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.వరద మరింత ఎక్కువైతే బాధితులు సహకరించి పురావాస కేంద్రాలకు తరలిరావాలని అధికారులు కోరుతున్నారు. ఆయా గ్రామాలలో పోలీస్ రెవెన్యూ పంచాయతీరాజ్ శాఖ అధికారులు పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



ఉమ్మడి కృష్ణా జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి-గన్నవరం : ఉమ్మడి కృష్ణా జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డి. దుర్గా ప్రసాద్ తెలిపారు. ఆదివారం క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయం లో జరిగిన సమావేశంలో కార్యావవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులు గావి. వెంకటేశ్వరరావు, కార్యదర్శి గా యం. శివ శంకర్, కోశాధికారిగా బి. రమేష్ ఎన్నికైయ్యారు. అలాగే ఉపాధ్యకులుగా బి వి. నరసింహ, వై. రమేష్ కుమార్ పి. గోపాలరావు, పి.యస్. ప్రకాషరావు, డి. శర్వాణి సంయుక్త కార్యదర్శులు గాయస్. మోహన్ రావు,పి. శ్రీనివాసరావు, జి వి. సుబ్బారావు,కే. శ్రీనివాసరావు, కే టి. సీతారాంలు ఎన్నికైయ్యారు. కాగా కార్యవర్గం జిల్లా బాల్ బాడ్మింటన్ సంఘం చైర్మన్ గా డి. శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా మురళీకృష్ణను నామినేట్ చేసుకుంది.

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మండ లంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండ లమ్మ అమ్మవారి దేవ స్థానంలో ఆదివారం సంధ ర్భంగా అధిక సంఖ్యలో యాత్రి కులు అమ్మ వారిని దర్శనం చేసుకు న్నారు. సుమారు 20 వేల పైగా యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నారు. అత్యధిక సంఖ్యలో అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానికి విచ్చేసిన యాత్రికులకు తాగునీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వ హణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



అర్హులందరికీ పింఛన్ అందిస్తాం

- ఎమ్మెల్యే రాజగోపాల్

ప్రజాశక్తి జగ్గయ్యపేట

జగ్గయ్యపేట నియోజకవర్గంలో అర్హత కలిగిన లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) భరోసా ఇచ్చారు. ఇటీవల ప్రభుత్వ అధికారులు చేపట్టిన రీ-వెరిఫికేషన్లో జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన కొంతమంది అర్హుల పెన్షన్లు పొరపాటున రద్దయిన విషయం తన దష్టికి వచ్చిందని తెలిపారు. అర్హులైన వారికి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇప్పటికే రద్దైన పెన్షన్లకు సంబంధించిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వికలాంగులు, వద్ధులు, వితంతువులకు పెన్షన్ రద్దైతే ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ వద్ద వెంటనే దరఖాస్తు చేసుకుంటే మళ్లీ పెన్షన్ మంజూరవుతుందని స్పష్టం చేశారు.



కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులకు సన్మానం

ప్రజాశక్తి-వత్సవాయి

ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తల్లిదండ్రులను, గురువుని మర్చిపోకూడదని స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు ఆర్కే ఫంక్షన్ హాల్ నందు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలలో విజయం సాధించిన పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన పోరెల్ల గోపీచంద్, చేపలమడుగు నవీన్, కోదాటి నాని, సూర్య రాజులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో చింతల సీతారామయ్య, వేగినేటి గోపాలకష్ణ, కర్ల వెంకటనారాయణ, గజ్జి కష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సిలో రమ్యకు 19వ ర్యాంకు

ప్రజాశక్తి-వత్సవాయి



ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డిఎస్‌సి ఫలితాల్లో అనిగండ్లపాడు గ్రామానికి చెందిన మలవత్తు రమ్య జిల్లా స్థాయిలో 19 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందలు తెలిపారు. తండ్రి మాలావత్ శ్రీను నాయక్ వృత్తిరీత్యా వెటర్నరీ అసిస్టెంట్, తల్లి గహిణి. రమ్య భర్త స్కూల్ పిఈటిగా పనిచేస్తూ ఉన్నత మెలకువలు నేర్పుతూ ఆమె విజయానికి కారకులయ్యారు. చెల్లి అగ్రికల్చరల్ అసిస్టెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం అవిరల కషి చేసిన రమ్యను పలువురు నాయకులుఅభినందించారు

లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు సోమశేఖర్ మృతి

ప్రజాశక్తి-కంచికచర్ల

కంచికచర్ల లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ ఫైనాన్స్ వ్యాపారి సూదుల సోమశేఖర్ (65) అనారోగ్యంతో శనివారం మతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యానికి గురైన సోమశేఖర్ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. లయన్స్ క్లబ్ ద్వారా కరోనా సమయంలో సేవా కార్యక్రమాలు చేయటంలో సోమశేఖర్ ముందునిలిచారు. ఆదివారం నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు, కంచికచర్ల ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు, నాయకులు కాలవ నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ ప్రముఖ వైద్యులు డాక్టర్ పుల్లగూర ప్రభాకరరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ నన్నపనేని లక్ష్మీ నారాయణ తదితర ప్రముఖులు సోమశేఖర్ మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఉద్యోగాల సాధనలో జెఆర్‌సి విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట






విద్య వ్యక్తిగత విజయానికి మాత్రమే కాదు, సమాజం మొత్తం అభివద్ధికి మూలస్తంభం అని మరోసారి రుజువైంది. జగ్గయ్యపేట విశ్వభారతి డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభతో ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి తల్లిదండ్రులకే కాకుండా ఈ ప్రాంతానికే ఆదర్శంగా నిలిచారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన టీచర్, పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో అద్భుతమైన విజయాలను సాధించారు. జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామానికి చెందిన ఆవుల సంధ్య డిఎస్‌సిలో 7వ ర్యాంక్ సాధించారు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించి జెఆర్‌సి విశ్వభారతి డిగ్రీ కళాశాల విద్యార్థులు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. వారిలో పెనుగంచిప్రోలుకు చెందిన చెందిన సూర్య రాజు, కుతాటి నాని, వత్సవాయి మండలం చిట్టేలా గ్రామానికి చెందిన కొదమల రవితేజ ఉద్యోగాలు సాధించారు. ఈ విజయాలు పట్టుదల, క్రమశిక్షణ, సరైన మార్గనిర్దేశకత్వం ఉంటే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం కష్టమేమి కాదని ఈ ఫలితాలు నిరూపించాయి. ఇంతటి అద్భుతమైన విజయాలను సాధించిన కళాశాల విద్యార్థులను జెఆర్‌సి వివిడిసి యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాల్స్ రంగాపురం నరసింహారావు, పెనుగొండ వెంకట రాజీవ్, జూటూరి వెంకటేశ్వర్లు (అబ్బులు), కొల్లా. నాగ రమేష్, జల్లా తిరుపతిరావు, వంగర వెంకట లక్ష్మి నారాయణ, కళాశాల అధ్యాపకులు, ప్రముఖులు, విద్యార్థులు విజేతలకు శు భాకాంక్షలు తెలిపారు.



ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- నందిగామ

నందిగామ పట్టణంలో సిఎస్ఐ చర్చి ఆవరణలో ఆదివారం సమత క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా నందిగామ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరు రజనీ కాంత్, మాజీ ఎంఇఒ కుమార్, పాస్టర్ కోట రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం అభిమాని మృతి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం



రెడ్డిగూడెం మండల కేంద్రంలోని దళితవాడకు చెందిన 4వ తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి కృష్ణా జిల్లా నాయకుడు, సిపిఎం సానుభూతిపరుడు చాట్ల సువర్ణరాజు (42) ఆదివారం మృతి చెందారు. రెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న సువర్ణరాజు భౌతికకాయానికి వైస్ ఎంపిపి చాట్ల రాబర్ట్, టిడిపి నాయకులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మాతంగి రామారావు, చాట్ల బాబురావు, చాట్ల చందా, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు చాట్ల విజయకుమార్ ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

యూరియా సరఫంలో ప్రభుత్వం విఫలం : వైసిపి

ప్రజాశక్తి - తిరువూరు


సమావేశంలో మాట్లాడుతున్న నల్లగట్ల స్వామిదాసు

ఖరీఫ్ సీజన్లో రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేయలేక కూటమి ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోందని వైసిపి తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. తిరువూరు నగర పంచాయతీ పరిధిలోని 3వ వార్డు సీఎస్ఐ చర్చి సెంటర్‌లో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. వైసి పి ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే రైతులకు అన్ని ఎరువులు అందుబాటులో ఉంచారని, తమ ప్రభుత్వ ఐదేళ్ళ పాలనలో రైతులకు ఎరువుల కొరత లేదని పేర్కొన్నారు. ఉద్దేశ్యపూర్వకంగా యూరియాకు బదులు నానో ఎరువుల అమ్మకం పేరుతో రైతులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ప్రజల కనీస అవసరాలు నెరవేర్చే పరిస్థితిలో కూటమి ప్రభుత్వం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కాలసాని గోపాల నాగేశ్వరరావు, కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, పరసా శ్రీనివాసరా వు, ఏరువ ప్రకాష్ రెడ్డి, గుంటూరు మస్తాన్, పార్టీ నాయకులు షేక్ జాకీర్, మోషే తిరుమల శెట్టి వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

బీరువా బహూకరణ

ప్రజాశక్తి -మైలవరం

హరి అప్పారావు పుట్టినరోజు సందర్భంగా లయన్స్ క్లబ్ ఆప్ మైలవరం వారి ప్రేరణతో స్థానిక ఎస్‌విఆర్‌జిఎన్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆదివారం బీరువాను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం పిఎస్టీలు చనుమోలు నాగభూషణం, శీలం రామిరెడ్డి, చలవాది హరీష్ కుమార్ గుప్తా, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు సతీష్, జోన్ ఛైర్మన్ తిరుమల శెట్టి శ్రీధర్, పాల్గొన్నారు.

కెఎంఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి- నందిగామ



నందిగామ మండలం పెద్దవరం గ్రామ సచివాలయం నందు లైన్స్ క్లబ్ అధ్యక్షులు మాలెంపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో కేయం ఆర్ హాస్పటల్, మణిపాల్ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహీంద్రా, లైన్స్ క్లబ్ సెక్రటరీ చెరుకుమల్లి శ్రీనివాసరావు, ప్రతినిధులు మందరపు సీతారామయ్య, చల్ల గాంధీ, రాయల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడులో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-వీరులపాడు

ప్రభుత్వాలు మారినప్పటికీ వీరులపాడు అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉంది. రహదారులు, విద్యుత్, పాఠశాలలు, ఆరోగ్య సదుపాయాలు వంటి ప్రాథమిక వసతుల కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న వీరులపాడు మండలం అభివృద్ధిలో వెనుకబడిపోతూ స్థానికులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. మండలం మొత్తం జనాభా 40 వేలకుపైగా ఉన్నప్పటికీ ఈ ప్రాంత అభివృద్ధి పట్ల సరైన ప్రణాళిక లేకపోవడం రైతులు, విద్యార్థులు, మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు ఈ మండలంలో వైరా, కట్టలేరు, ఏనుగడ్డ బాగున్నప్పటికీ రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయి. పంటల సాగుకు అవసరమైన నీరు సకాలంలో అందకపోవడంతో ప్రతి ఏటా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలపై ఆధారపడి సాగు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడటంతో పంటల దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. గతంలో ఎన్నెస్పీ కాలువల ద్వారా సాగునీరు సరఫరా అయ్యేది. కాలువల నిర్వహణా లోపం, పాలకుల నిర్లక్ష్యంతో గత కొన్నేళ్లుగా సకాలంలో నీరు అందక రైతులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పంటలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బోర్లు కూడా ఆరిపోవడంతో నీటి కొరత మరింతగా తలెత్తుతోంది. మండల పరిధిలో ఉన్న జయంతి, దొడ్డదేవరపాడు, తాటిగుమ్మి, ఎత్తిపోత పథకాలు సక్రమంగా పనిచేయకపోవడంతో సాగునీరు అందడంలేదు. మొక్కజొన్న, పత్తి, మిర్చి, కందితో పాటు వ్యవసాయ ఖర్చులు పెరిగాయి. భారీ వర్షాలకు పెసర, మినుము పంటలు సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో రైతులు సుబాబుల్, జామాయిల్ సాగువైపు మొగ్గుచూపుతున్నారు. ఈ ఏడాది సుమారు 500 ఎకరాల్లో జామాయిల్ సాగుచేశారు.

అభివృద్ధిలో వెనుకబాటు

వీరులపాడు అభివృద్ధిలో వెనుకబాటుకు గురవుతోంది. రహదారులు, విద్యుత్, పాఠశాలలు, ఆరోగ్య సదుపాయాలు వంటి ప్రాథమిక వసతుల లోపం స్పష్టంగా కనిపిస్తోంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన రవాణా వసతి లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వీర్లపాడు, పల్లంపల్లి, కొండపల్లి, ఎల్లంకి, బోడవాడ, జమ్మవరం, గోకరాజు పల్లి, పొన్నవరం గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోల మీద ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఉచిత బస్సు పథకం ఈ గ్రామాల్లో నివసిస్తున్న వారికి ఉపయోగపడడంలేదని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని మహిళలు కోరుతున్నారు.

మూడో రోజుకు ఎడ్లలంక వాసుల దీక్ష

ప్రజాశక్తి-అవనిగడ్డ : కృష్ణా నదికి వస్తున్న వరదలతో తమ గ్రామం పూర్తిగా దెబ్బతింటుందని అనేక గహాలు నదిలో కలిసిపోతున్నాయని తెలుపుతూ పాత ఎడ్ల లంక గ్రామస్తులు చేపట్టిన నిరసన దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. కట్టుకున్న ఇల్లు కూలిపోయి కోతకు గురవుతున్న ఊరు కొట్టుకుపోవడానికి సిద్ధంగా ఉంటే తమరెవరు పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఆ గ్రామానికి చెందిన మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దోవా గోవర్ధన్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అధికారులు ఎడ్లలంక సమస్యను నిర్లక్ష్యం చేయడం తగదు అన్నారు. గ్రామ సమస్యలు పరిష్కరించే వరకు తమ ఆందోళన ఆగదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఐదో వార్డ్ మెంబర్ వనమాలి విజయబాబు, గ్రామస్తులు పెమ్మాడి నాంచారయ్య, మునిపల్లి లాజరు, బందిల లక్ష్మణ్, కొల్లు గోపాలకష్ణ పాల్గొన్నారు.

దీక్షకు వైసీపీ యువనేత బడే గౌతం సంఘీభావం : గత మూడు రోజులుగా తమ గ్రామాన్ని వరద బారి నుండి రక్షించాలంటూ నిరసన దీక్ష చేస్తున్న పాత ఎడ్ల లంక గ్రామస్తులకు వైసీపీ యువనేత బడే గౌతం సంఘీభావం తెలిపారు. ఆదివారం ఎడ్ల లంక గ్రామం వెళ్లి గ్రామస్తులను పరామర్శించి మాట్లాడారు. వరదల వల్ల గ్రామంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని ఆందోళనలో గ్రామస్తులు ఉన్నారని, గ్రామం కోతకి గురికాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు గ్రామస్తులు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా వారికి స్పష్టమైన హామీ ఇచ్చి వారికి న్యాయం చేయాలని గౌతం డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ నీటి సంఘం అధ్యక్షులు వర్రె బసవరావ్, ఎడ్ల లంక యువకులు బందెల సాంబయ్య, నలకుర్తి రమేష్, నలకుర్తి దీవెన కుమార్ ఉన్నారు.



బాధితులతో కలిసి దీక్షలో పాల్గొని సంఘీభావం తెలుపుతున్న బడే గౌతం



మాట్లాడుతున్న కరస్పాండెంట్ ఉమామహేశ్వరరావు

ఎస్‌విఎల్‌లో ప్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని ఎస్‌విఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు వెల్కమ్ పార్టీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల కరస్పాండెంట్ డి ఉమామహేశ్వరరావు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. నూతనంగా కళాశాలలోకి అడుగు పెడుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో పట్టుదలగా విద్యనభ్యసించి ఉత్తమ మార్కులతో విజయం సాధించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



వాసే మురళీని అభినందిస్తున్న దృశ్యం

టిడిపి గుడివాడ రూరల్ మండల అధ్యక్షుడిగా మురళి

ప్రజాశక్తి - గుడివాడ : రూరల్ మండలం టిడిపి అధ్యక్షుడిగా వాసే మురళీకృష్ణ ఎన్నికయ్యారు. ఆదివారం రూరల్ మండలం అధ్యక్షుడిగా వాసే మురళీని మళ్లీ పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఆయన నియామకం పట్ల రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు, పట్టణ టిడిపి నాయకులు వాసే మురళీని సత్కరించారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన జిల్లా ఉద్యోగ ఉపాధి శిక్షణా అధికారి దేవరపల్లి విక్టర్ బాబుని కృష్ణా జిల్లా ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మలకాపట్నం గుప్తా సెంటర్ వద్ద ఈ జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సహకార సంఘ అధ్యక్షులు బోకినేలా విజయ్ కుమార్, విశ్రాంతి ఎంపీడీఓ పెనుమచ్చ మధు, గండ్రపు శీనయ్య మాస్టర్, ఎం ఈ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జుజ్జవరపు, అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి బీడెల్లి మరియకుమార్ పాల్గొన్నారు.



విక్టర్‌బాబును సన్మానిస్తున్న దృశ్యం

వెంకటేశ్వరరావు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-చల్లపల్లి : డీఆర్వో సిసి తూము వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రం పొందిన సందర్భంగా మిత్రబందం ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ పార్కులో సన్మానం జరిగింది. చల్లపల్లి సిఐ కె.ఈశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని తూము వెంకటేశ్వరరావును సన్మానించారు. చల్లపల్లి ఉప సర్పంచ్ ముమ్మనేని నాని, విశ్రాంత ఈఓఆర్డీ దాసి సీతారామరాజు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కైతేపల్లి దాస్, నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ (గన్నవరం) : బాపుల పాడు మండలం కానుమోలు జిల్లా పరిషత్ హైస్కూల్ లో ది హనుమాన్ జంక్షన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో విజయవాడకు చెందిన హదయాలయ హాస్పటల్ కు చెందిన డాక్టర్ శివరాం ప్రసాద్, డాక్టర్ బళ్ళా నాగార్జున, డాక్టర్ దాట్ల దివ్య సరోజ, డాక్టర్ సూర్య వంశీ, గుండె జబ్బులు సంబంధించిన పరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో, వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ది హనుమాన్ జంక్షన్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యర్రంశెట్టి సాయి సదా స్వప్న కుమార్ మాట్లాడుతూ 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు ఆయన తెలియజేశారు. హనుమాన్ రైస్ ట్రేడర్స్ అధినేత పొట్లూరి సీతారాం ప్రసాద్, శ్రీ మారుతి రైస్ ట్రేడర్స్ అధినేత పొట్లూరి శ్రీరామ్ మూర్తి, ది హనుమాన్ జంక్షన్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి బళ్ళా వీర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని చిట్టూర్పు గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎన్టీఆర్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో కీ.శే. పోతార్లంక వెంకట్రామయ్య - ఉషా కన్య దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు పోతార్లంక వీర లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తాడిగడపలోని కామినేని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు కార్డియాలజీ, జనరల్ విభాగాలలో ప్రజలకు వైద్య సేవలు అందించారు. గుణదల హెచ్.జి.సి క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య బందం ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. గుడివాడ లయన్స్ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో రోగులకు కంటి పరీక్షల నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు.కొడాలి పిఎసిఎస్ అధ్యక్షులు గుత్తికొండ వరప్ర సాద్, గ్రామ సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, గ్రామ ప్రముఖులు దాసరి బసవ కుటుంబరావు పాల్గొన్నారు



ఘంటసాల మండలంలో...

కమిటీల నియామకానికి ప్రతిపాదనలు స్వీకారం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా కమిటీల నియామకం చేపడుతున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తెలుగుదేశం పార్టీ కష్ణా జిల్లా నూతన కమిటీల నియామకం ఏర్పాటు కొరకు ఆదివారం స్థానిక మన కన్వెన్షన్లో మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పార్లమెంటు, నియోజకవర్గం, మండలం, అనుబంధ సంఘాల నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము , బోడే ప్రసాద్, వర్ల కుమార్ రాజా , కాగిత కష్ణ ప్రసాద్ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ , మాజీ డిప్యూటీ స్పీకర్ వేదవ్యాస్ , కంభంపాటి రామ్మోహన్ రావు , గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు తొలగించడం అన్యాయం : వైసిపి



ప్రజాశక్తి-మోపిదేవి : కూటమి ప్రభుత్వం వచ్చిన 14 నెలలలో పేదవాడికి నష్టం చేస్తుందని అవనిగడ్డ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తెలిపారు. ఆదివారం మోపిదేవి మండలం పెదకళ్ళేపల్లి గ్రామంలో వికలాంగ పెన్షన్ కోల్పోయిన తాడేపల్లి లక్ష్మణరావు, కేతరాజు నాగమల్లేశ్వరమ్మ లను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లకు ఐదు నుండి రూ.10వేలు ఇస్తానని కూటమి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు యూరియా ఇవ్వకుండా నష్టపరచాలని చూస్తుందన్నారు. 22ఎ భూమిని జగన్ రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తే అధికారంలోకి వచ్చిన మరుక్షణమే ఫ్రీజ్ చేశారని విమర్శించారు. ఈ కూటమి ప్రభుత్వం ఆర్థిక సంపన్నులకు ఉపయోగపడే ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో పేదవాళ్ల చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దివ్యాంగుల పెన్షన్ విషయంలో ఎవరైతే సదరన్ సర్టిఫికెట్ ఇచ్చారో డాక్టర్ల పైన కూడా యాక్షన్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు గరిగిపాటి వెంకటేశ్వరరావు(బుల్లి) మాజీ సర్పంచ్ అర్జ వెంకట సుబ్బారావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లింగం జగదీష్, గ్రామ వైసిపి అధ్యక్షులు గండు దుర్గారావు, మోర్ల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కన్ను లేదు..అయినా పింఛను తీసేశారు...

- బాధితురాలి ఆవేదన



పెట్టుడు కన్ను చూపిస్తున్న భూపతి నాగమణి

ప్రజాశక్తి-కోడూరు : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తమకు అగచాట్ల వచ్చాయని ఓ వికలాంగురాలు పెట్టుడు కన్ను బయటకు తీసి చేత పట్టుకొని చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేసింది. ఆదివారం కోడూరు గ్రామానికి చెందిన భూపతి నాగమణి పాత్రికేయులతో మాట్లాడుతూ తనకి 2006 నుంచి పెన్షన్ వస్తుందని, ప్రస్తుతం ప్రభుత్వం తన పెన్షన్ తొలగించినట్లు నోటీసు నోటీసులు అందించారని తెలిపింది. నాకు ఒక్క కన్ను మాత్రమే ఉందని, కట్టుడు కన్ను పెట్టుకున్నానని తన కన్నును బయటకు తీసి చూపించింది. ఇటీవల వైద్య పరీక్షల్లో 40 శాతం వైఫల్యం ఉందంటూ తెలియపరిచారని తెలిపింది. తన బాధను చెప్పుకోవడం కోసమే కన్ను తీసి చూపిస్తున్నానని, రెండో కన్ను కూడా సరిగా కనిపించకపోవడంతో ఏ పని చేసుకోలేక పోతున్నానని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు గతంలో మాదిరిగానే పెన్షన్ కొనసాగించాలని కోరింది. ఈ విషయంపై కోడూరు మండలం ఎంపీడీవో సుధా ప్రవీణ్‌ని వివరణ కోరగా భూపతి నాగమణికి మాత్రమే కాకుండా కోడూరు మండలంలో ఒక కన్ను ఉన్న ఇంకొందరికి కూడా నోటీసులు అందించామని, భూపతి నాగమణి దగ్గర దరఖాస్తు తీసుకుని మళ్లీ అప్లై చేశామన్నారు.

ప్రమాదకరంగా కురుమద్దాలి హైవే అండర్ పాస్ రోడ్డు

ప్రజాశక్తి-పామర్రు : మండల పరిధిలోని కురుమద్దలి వద్ద ఉన్న మచిలీపట్నం-విజయవాడ హైవే బ్రిడ్జి కింద వెళ్లే రహదారి వాహనదారులకు ప్రమాదంగా మారింది. బ్రిడ్జి పక్కన ఉన్న సర్వీసు రోడ్ల కంటే బ్రిడ్జి కింద నుండి వెళ్లే రోడ్డు పల్లంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికి సైతం ఇక్కడ అడుగుకు లోతుకు పైబడి నీరు నిలబడు తోంది. ఆ నీరు పోయేందుకు ఏర్పాటు చేసిన డ్రైనేజీ సౌకర్యం సరిగా లేనందువల్ల ఈ దుస్థితి ఏర్పడింది. బ్రిడ్జి కింద రహదారి రోజుల తరబడి నీటితో నాని ఉండటం వల్ల వాహనాల రాకపోకల కారణంగా పూర్తిగా గోతుల మయంగా మారింది. విజయవాడ, కంకిపాడు, ఉయ్యూరు తదితర ప్రాంతాల నుండి పామర్రు వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు తప్పనిసరిగా ఈ బ్రిడ్జి కింద నుండే కురుమద్దాలి గ్రామం మీదుగా పామర్రుకు రావాలి. వర్షంనీటితో ఈ రహదారి నిండుకొని ఉన్న సమయంలో రాకపోకలు సాగించే వాహనదారులకు ఈ గోతులు కనిపించవు. సంబంధిత అధికారులు బ్రిడ్జి కింద నీరు పోయేందుకు డ్రైనేజీలు సరిచేసి గుంతలు పడిన రహదారిని బాగు చేసే చర్యలు చేపట్టాలని పామర్రు ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



గోతులమయంగా ఉన్న అండర్‌పాస్ రోడ్డు

సారూ..నా ఉద్యోగం ఇప్పించరూ..

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం బిబి గూడెం గ్రామానికి చెందిన కాండ్రు మోహనరావు విద్యా శాఖలో సీఆర్‌పిగా తిరిగి ఉద్యోగాన్ని తనకి ఇప్పించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కోరారు. మోహనరావు గన్నవరం మండల విద్యాశాఖలో 2012 నుండి కాంట్రాక్ట్ జాబ్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నాడు. అయితే 2024 సెప్టెంబర్ 13 న కృష్ణా జిల్లా కలెక్టర్‌కు గన్నవరం ఎంఈఓ ఆఫీసులో ఇరెగ్యులర్ ఆఫ్ డ్యూటీస్ అని కంప్లైంట్ ఇప్పించి అతన్ని టెరిమినేషన్ చేయించారు. అది వాస్తవం కాదని చెప్పినా ఎవరూ పట్టించుకోవడంలేదని మోహనరావు వాపో యాడు. దళిత కుటుంబానికి చెందిన తాను 12 సంవత్సరాలు విద్యాశాఖలో సేవలు అందించానన్నారు. కొంతమంది తప్పుడు సమాచారంతో ఉద్యోగం నుంచి తీసి వేశారనీ, తన వేదన అర్థం చేసుకొని ఉద్యోగం ఇప్పించాలని కోరారు.

శ్రమ ఆధారంగానే ప్రపంచ పురోగమనం

- చిత్రకారుల రాష్ట్ర సమ్మేళనంలో వక్తలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ప్రపంచం కష్టజీవుల శ్రమపై ఆధారపడి ముందుకు వెళుతోందని, ఆ శ్రమను గౌరవించడం అందరి కర్తవ్యమని పలువురు వక్తలు అన్నారు. విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం 'వర్తమాన పరిస్థితుల్లో చిత్రకారుడి పాత్ర' అన్న అంశంపై ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్స్, ఎంబివికె ఆధ్వర్యాన చిత్రకారుల రాష్ట్ర సమ్మేళనం జరిగింది. ఈసందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 40 మంది చిత్రకారులు 'శ్రమైక జీవనం' పేరుతో గీసిన చిత్రాలను చిత్రకళ అవధాన్ శిల్పి మర్లపూడి ఉదయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ బాధ్యులు సునీల్ కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీధర్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కళకు హద్దులు లేవని అన్నారు. అధ్యక్షత వహించిన ఉదయ్ కుమార్ మాట్లాడుతూ శ్రమైక జీవన సౌందర్యంపై చిత్రకారులు గీసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రజల శ్రమ జీవనాన్ని ఉట్టిపడేలా చిత్రాలు గీసిన చిత్రకారులను అభినందించారు. చిత్రలేఖనం నేటికీ ప్రాముఖ్యతను నిలబెట్టుకున్నా ప్రభుత్వాల ఆదరణ కొరబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సాంస్కృతిక రంగంలో చిత్రలేఖనం పాత్రను ప్రభుత్వాలు విస్మరించడంతో కళాకారులు కష్టాలకు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. కళాకారులను ఆదరించడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. 'సాంప్రదాయ చిత్రకళ ఆవశ్యకత' అన్న అంశంపై సాంప్రదాయ చిత్రకళా విశ్లేషకులు డాక్టర్ సాగర్ గిన్నె, 'చిత్రకళా రంగంలో వస్తున్న మార్పులు'పై యోగి వేమన విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ విభాగానికి చెందిన డాక్టర్ మత్యుంజయరావు, 'మార్పులకు అనుగుణంగా చిత్రకారుడు పాత్ర' అంశంపై ప్రముఖ చిత్రకారులు వై. శేష బ్రహ్మం వివరించారు. నగర ప్రముఖులు బాయన వెంకట్రావు మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమ నగరంలో జరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె కార్యదర్శి పి.మురళీకృష్ణ, అమరావతి బుద్ధ విహార్ బాధ్యులు శుభాకర్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ బాధ్యులు అరసవిల్లి గిరిధర్ , మల్లిక్, సంధ్య తదితరులు మాట్లాడారు.




సదస్సులో మాట్లాడుతున్న వెంకట్రావు, గిరిబాబు



సదస్సులో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్



చిత్రాలను వీక్షిస్తున్న నగర వాసులు



దసరా ఉత్సవాలపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇఒ

దసరా ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

ఇంద్రకీలాద్రిపై సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే దసరా మహోత్సవాల ఏర్పాట్లను దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, దుర్గగుడి ఇఒ శీనా నాయక్‌లతో కలిసి సమీక్షించారు. ఈసారి దసరా ఉత్సవాలను గతంలో కంటే మరింత వైభవంగా, అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. క్యూలైన్లలో తాగునీరు, అన్నప్రసాదాలు అందేలా చూడాలని సూచించారు. అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం రోజున (సెప్టెంబర్ 29న), విజయదశమి రోజున (అక్టోబర్ 2న) అమ్మవారి దర్శనానికి వచ్చేసే యాత్రికులకు ఉచితంగా లడ్డూ ప్రసాదం పంపిణీ చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆలయ అధికార్లను సూచించారు. వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆదేశించారు.



అర్జున్ చక్రవర్తి చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

'అర్జున్ చక్రవర్తి' చిత్ర బృందం నగరంలో సందడి చేసింది. కబడ్డీ నేపథ్యంలో తీసిన అర్జున్ చక్రవర్తి చిత్రం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని, ఆరేళ్లపాటు శ్రమించి ఈ చిత్రాన్ని అద్భుతంగా తీశామని, ప్రేక్షకులు ఈ చిత్రాన్ని వీక్షించి విజయవంతం చేయాలని హీరో విజయరామరాజు కోరారు. విజయరామరాజు హీరోగా నటిస్తున్న 'అర్జున్ చక్రవర్తి' సినిమా ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం బందర్ రోడ్డులోని హోటల్ మురళీ ఫార్చ్యూన్ హోటల్లో చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హీరో విజయరామరాజు మాట్లాడుతూ అర్జున్ చక్రవర్తి కేవలం సినిమా మాత్రమే కాదనీ నా తొమ్మిదేళ్ల కల అని అన్నారు. మైనస్ డిగ్రీ వాతావరణంలో షర్టు లేకుండా నటించానని, ఈ నెల 29న ప్రేక్షకులు తమ చిత్రాన్ని వీక్షించి ఆదరిస్తే కష్టానికి తగిన ఫలితం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐపిఎల్‌లో కబడ్డీ ఆడే క్రీడాకారులను ఈ చిత్రంలో తీసుకొని వారితో కబడ్డీ ఆడే సన్నివేశాలను తీయడం జరిగిందన్నారు. హీరోయిన్ సీజరోజ్ మాట్లాడుతూ అర్జున్ చక్రవర్తి చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం అవుతున్నట్లు తెలిపారు. డైరెక్టర్ విక్రాంత్ రుద్ర ఈ చిత్రాన్ని ఎంతో అద్భుతంగా తీశారని, ఈ చిత్రం నిర్మించడానికి నిర్మాత శ్రీని ఎంతగానో సహకారం అందించారని చెప్పారు. నటుడు యోగానంద రెడ్డి మాట్లాడుతూ కబడ్డీ క్రీడ 1995 దశకంలో ఏ విధంగా ఉండేదని ఆ సన్నివేశాలను దర్శకుడు చాలా సహజంగా నిర్మించడం జరిగిందన్నారు. నటుడు దుర్గేష్ మాట్లాడుతూ ఈ చిత్రం ప్రేక్షకులకు ఆకట్టుకుంటుందని ఆయన ఆశ భావం వ్యక్తం చేశారు.

'సండేస్ ఆన్ సైకిల్ విత్ స్టేట్ పోలీస్ ఫోర్స్' ర్యాలీ

ప్రజాశక్తి-విజయవాడ

ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సండేస్ ఆన్ సైకిల్ విత్ స్టేట్ పోలీస్‌ఫోర్స్ కార్యక్రమాన్ని ఆదివారం డిసిపి ఎస్‌విడి.ప్రసాద్ ప్రారంభించారు. ఎన్‌టిఆర్ పోలీస్ కమిషనరేట్ బందర్ రోడ్డులోని వ్యాస్ కాంప్లెక్స్ నుండి పాత పిసిఆర్‌జంక్షన్, బెంజ్ సర్కిల్ వరకు, అక్కడ నుంచి తిరిగి వ్యాస్ కాంప్లెక్స్ వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది, పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా డిసిపి మాట్లాడుతూ వేగవంతమైన జీవన శైలిలో ఎక్కువగా ద్విచక్ర వాహనాలు, కార్లలో ప్రయాణించడం ఒక అలవాటుగా మారిందన్నారు. ఆధునిక సౌకర్యాలతో జీవనం సాగిస్తున్నప్పటికీ, శారీరక చురుకుదనం లేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని తెలిపారు. మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రస్తుత కాలంలో అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు సైకిల్ తొక్కడం ద్వారా శరీరానికి అవసరమైన వ్యాయామం లభిస్తుందని, ఇది గుండె సంబంధిత వ్యాధులు, ఊబకాయం, మధుమేహం వంటి అనేక రకాల సమస్యలను నివారించగలదని చెప్పారు. ప్రతిరోజూ కనీసం ఒక గంటపాటు నడక, యోగా, ఇతర వ్యాయామాలు చేయడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, శరీరానికి ఉత్సాహం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ఎ డిసిపి కె.కోటేశ్వరరావు, ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, పోలీస్ సిబ్బంది, నలంద స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డిసిపి

ట్రాన్స్ యూనియన్ సిబిల్ 25వ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

క్రెడిట్ వ్యవస్థపై విశ్వసనీయతను పెంపొందించేందుకు కృషి చేస్తున్న అగ్రగామి ఇన్‌సైట్స్, ఇన్ఫర్మేషన్ కంపెనీ ట్రాన్స్ యూనియన్ సిబిల్, 25వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోందని సంస్థ సిఇఒ భవేష్ జైన్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిబిల్ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా సుసంపన్న సాంస్కృతిక వారసత్వం, గణనీయమైన ప్రాచుర్యంతో తరతరాలుగా భారతీయులను అలరిస్తున్న అమర్ చిత్ర కథతో కలిసి 'సిబిల్ కీ కహానియా' పేరిట లెజెండరీ టింకిల్ కామిక్ బుక్ స్పెషల్ ఎడిషన్ రూపొందించిందని తెలిపారు. క్రెడిట్ స్కోరు అనేది కేవలం అంకెలకే పరిమితం కాకుండా ఇంటి కొనుగోలు లేదా వ్యాపారాన్ని ప్రారంభించడం లేదా విద్యా రుణం ఇలా వ్యక్తిగత ఆకాంక్షల సాధనకు ఏ విధంగా తోడ్పడుతుందనేది తెలియజేసేలా ఇది ఉంటుందన్నారు. రుణం అనేది ఏ విధంగా పురోగతికి, పరివర్తనకు తోడ్పడుతోందనేది తెలియజేసే విధంగా ఈ ప్రచార కార్యక్రమాలు రూపొందించబడ్డాయి అన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎమ్మెల్యే గద్దె రామమోహన్
- టేబుల్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని, పిల్లలకు చిన్నతనం నుండే క్రీడల పట్ల ఆసక్తి పెంచాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. 11, 13, 15 సంవత్సరాలలోపు విద్యార్థులకు రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం 10వ డివిజన్ ఆర్‌టిసి కాలనీలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను గద్దె రామమోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుండే క్రీడల పట్ల ఆసక్తి పెంచాలన్నారు.

స్థానిక కార్పొరేటర్ దేవినేని అపర్ణ మాట్లాడుతూ విజయం సాధించాలంటే కృషి, పట్టుదల ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫన్ టైమ్స్ సెక్రటరీ కె.శివాజీ, వైస్ ప్రెసిడెంట్ బొర్రా గాంధీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొసరాజు విజయబాబు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో రాష్ట్రం లోని వివిధ అకాడమిల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందించారు.

